క్లుప్తంగా

అతిసార నివారణకు కృషి చేయాలి



పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న వైద్యసిబ్బంది

గణపవరం : ఐదేళ్లలోపు పిల్లల్లో డయేరియా వ్యాధి నివారణకు ఓఆర్‌ఎస్, జింక్ ట్యాబ్లెట్లు ఉపయోగపడతాయని, తల్లిదండ్రులు ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని పిప్పర పీహెచ్‌సీ సీహెచ్‌వో జె.విల్సన్ అన్నారు. సోమవారం గణపవరంలోని నాలుగు సచివాలయాల పరిధిలో డయేరియా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విల్సన్ మాట్లాడుతూ పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాలలో ఐదేళ్లలోపు పిల్లలు 2 వేలమంది ఉన్నారని వీరందరి ఇళ్ల వద్ద ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్ కంటి వెలుగు గ్రామీణులకు వరం

గణపవరం: వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం గ్రామీణ ప్రాంత ప్రజలకు వరమని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని పిప్పర పీహెచ్‌సీ వైద్యాధికారులు ప్రియాంక, దివ్య అన్నారు. సోమవారం పిప్పర పీహెచ్‌సీ పరిధిలోని వడ్డిగూడెం సచివాలయంలో వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. 60 ఏళ్లు దాటిన 55 మందికి పరీక్షలు చేయగా అందరికీ కళ్లజోళ్లు అవసరమని, వీటిని ఉచితంగా అందచేస్తామని అన్నారు.

మోడల్ ఐటీ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటుకు కృషి



అమరావతిలో ఎంపీ విజయసాయిరెడ్డితో కలిసిన గూడపాటి పవన్‌కుమార్

దెందులూరు: దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ప్రత్యేక చొరవ తీసుకుని నియోజకవర్గంలో మోడల్ ఐటీ ట్రైనింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా ఐటీ విభాగ అధ్యక్షుడు గూడపాటి పవన్ అన్నారు. సోమవారం ఆయన అమరావతిలో పార్టీ జాతీయ కార్యదర్శి ఎంపీ వీ.విజయసాయిరెడ్డిని కలిశారు. జిల్లా వ్యాప్తంగా ఐటీ విభాగ నియామక కమిటీలు 2024 ఎన్నికలకు సంబంధించి ఐటీ విభాగం తరపున అమలు చేస్తున్న ప్రణాళిక, కార్యక్రమాలను ఎంపీకి వివరించారు.

కల్యాణ మండపం అభివృద్ధికి ఎంపీ సహకారం



సత్యవోలులో జెడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ ప్రసాదరావుతో చర్చిస్తున్న ఎంపీ కోటగిరి శ్రీధర్

పెదపాడు: సత్యవోలులోని కల్యాణ మండపం అభివృద్ధికి ఎంపీ నిధులు కేటాయిస్తామని ఎంపీ కోటగిరి శ్రీధర్ తెలిపారు. సోమవారం సత్యవోలులో ఎంపీ శ్రీధర్, జెడ్పీచైర్మన్ ఘంటా పద్మశ్రీ ప్రసాదరావుతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు కల్యాణ మండపం అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు. అంచనాలు తయారు చేయాలని వారికి ఎంపీ సూచించారు. అనంతరం ఇటీవల వివాహమైన వైకుంతపు రమేష్ కుమారుడు భరత్, కునుకు వెంకట్రావు కుమారుడు పవన్‌కుమార్, మద్రాపు ఏసు కుమార్తెను ఎంపీ ఆశీర్వదించారు. నర్సాపురం నియోజకవర్గ పరిశీలకుడు ఘంటా ప్రసాదరావు పాల్గొన్నారు.

లేఅవుట్ల పరిశీలన

ఉంగుటూరు : కొత్త ఉంగుటూరులో పంచాయతీ అనుమతులు లేకుండా లేఅవుట్లు వేసి స్థలాలు విక్రయిస్తున్నారని ఇటీవల స్పందనలో వచ్చిన ఫిర్యాదుపై అధికారులు సోమవారం ఫీల్డ్ విజిట్ చేశారు. మండల పంచాయితీ విస్తరణ అధికారి షేక్ షంషుద్దీన్, పంచాయతీ సెక్రటరీ కాకర్ల గిరిధర్, సచివాలయ సిబ్బంది అక్రమ లేఅవుట్‌లను పరిశీలించారు. లేఅవుట్‌లో నిబంధనలు పాటించడం లేదని అధికారులు గుర్తించారు. 10 మీటర్ల వెడల్పు రోడ్లు, ఎకరానికి 10 శాతం కామన్ సైట్స్ తదితర అనుమతులు పొందేలా చర్యలు చేపట్టాలన్నారు.

కోడి వ్యర్థాల వ్యాన్ పట్టివేత

పెదవేగి : అక్రమంగా రాత్రి వేళల్లో తరలిస్తున్న కోడి వ్యర్థాల వ్యాన్‌ను స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు పెదవేగి ఎస్సై ఎం లక్ష్మణ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఖమ్మం నుంచి భీమడోలు ప్రాంతానికి కోడి వ్యర్థాలను తరలిస్తున్నారన్న సమాచారంతో పెదవేగి ఎస్సై తన సిబ్బందితో కలిసి సోమవారం రాత్రి పెదవేగి మండలం వంగూరు సమీపంలో గస్తీ కాశారు. ఏపీ 37టీసీ 9247 నంబర్ గల వాహనంలో కోడి వ్యర్థాలను తరలిస్తున్నట్లు గుర్తించి వ్యాన్‌లోని వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వాహనాన్ని సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

విద్యార్థులకు జగనన్న విద్యాకానుక పంపిణీ

విజయరాయిలో విద్యాకానుక కిట్ల పంపిణీ

పెదవేగి : విజయరాయి జెడ్పీహెచ్‌ఎస్ హైస్కూల్లో సోమవారం నుంచి పాఠశాల పునఃప్రారంభించబడుతున్న సందర్భంగా 2023-2024 విద్యా సంవత్సరం సంబంధించి, బడికి వెళ్లే పిల్లలకు అవసరమైన వస్తువులతో కూడిన విద్యా కానుక కిట్లను విజయరాయి ఉప సర్పంచ్ లేగల శివరామకృష్ణ పిల్లలకు పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు ఎం వెంకటరమణ అధ్యక్షతన నిర్వహించారు. గ్రామ నాయకులు బొమ్మారెడ్డి రామచంద్రారెడ్డి, ఉపసర్పంచ్ లేగల శివరామకృష్ణ, ఎంపీటీసీ వసంతలక్ష్మీ, పేరెంట్స్ కమిటీ చైర్మన్, అడ్వకేట్ బైగాని రంగారావు, నాయకులు రెడ్డెం శ్రీనివాసరెడ్డి, మంతెన కిషోర్, పులగం వేణుగోపాల్‌రెడ్డి, పీబీ శ్రీనివాస్‌కృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆనందం

పెదపాడు: ఏలూరు జిల్లాలో సుమారు 1.57 లక్షల మందికి జగనన్న విద్యాకానుక కిట్లు అందిస్తున్నట్లు జిల్లా పరిషత్ చైర్మన్ ఘంటా పద్మశ్రీ ప్రసాదరావు తెలిపారు. మండలంలోని పెదపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చైర్‌పర్సన్ పద్మశ్రీ ప్రసాదరావు ముఖ్య అతిథిగా పాల్గొని జగనన్న విద్యాదీవన కిట్లు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా పద్మశ్రీ ప్రసాదరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యతనిస్తున్నారని అన్నారు. ప్రభుత్వం మండలానికి రెండు జూనియర్ కళాశాలలు ఏర్పాటుచేసినట్లు చెప్పారు. నాడు- నేడు పథకంపై ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం వల్ల పాఠశాలలు అభివృద్ధి చెందాయన్నారు. అనంతరం జగనన్న విద్యాకానుక కిట్లతో పాటు రాగిజావ కోసం స్టీల్ గ్లాసులు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ దంపతులను ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ఎంపీపీ బత్తుల రత్నకుమారి ఏసురాజు ఎంఈఓ సబ్బితి నర్సింహమూర్తి, ఎంపీడీవో ఎస్ నిర్మలజ్యోతి, తహసీల్దార్ జీ విజయ్‌కుమార్ రాజు, మండల ఉపాధ్యక్షురాలు రెడ్డి స్వర్ణకుమారి, గ్రామ సర్పంచ్ కొత్తూరి జీవనకుమారి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పీ వెంకటేశ్వరరావు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పెదపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జగనన్న కానుక కిట్లు అందిస్తున్న జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ

ప్రభుత్వ విద్యకు పెద్ద పీట

భీమడోలు : దేశ చరిత్రలోనే ప్రభుత్వ పాఠశాలల అభ్యున్నతికి పెద్ద పీట వేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని భీమడోలు, పూళ్ల గ్రామ సర్పంచులు పాము సునీతామాన్‌సింగ్, దాయం సుజాత ప్రసాద్ అన్నారు. జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ కార్యక్రమం మండలంలోని 45 ప్రాథమిక, ప్రాథమికోన్నత, జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో పండుగ వాతావరణంలో జరిగింది. 40,428 బాలబాలికలకు స్కూలు బ్యాగ్స్, షూస్, బెల్ట్, నోట్ పుస్తకాలను అందజేశారు. భీమడోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం బి.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ పాము సునీతా మాన్‌సింగ్, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు చేతుల మీదుగా 900 మందికి జగనన్న కిట్లను పంపిణీ చేశారు. ఎంఎంపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో సర్పంచ్ దాయం సుజాత ప్రసాద్; ఎంపీటీసీ గంటా శ్రీనివాసరావు, ఉపసర్పంచ్ పెద్దిరెడ్డి హరిబ్రహ్మానాయుడు చిన్నారులకు కిట్లను అందించారు. ఈ కార్యక్రమాల్లో హెచ్‌ఎం మధుసూదనరావు, ప్రముఖ వైద్యులు జి.బాబూరావు, పేరెంట్స్ కమిటీ చైర్మన్లు పి.కమలప్రియ, మద్దాల పోలరాజు, పేరెంట్స్ కమిటీ సభ్యులు, టీచర్లు పాల్గొన్నారు.

ఉప్పాకపాడులో పుస్తకాల పంపిణీ

ఉంగుటూరు : ఉప్పాకపాడులో సర్పంచ్ నేదూరి అబ్బులు చేతులమీదుగా సోమవారం జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేశారు. ఫౌండేషన్ ప్లస్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు నక్క సుధాకర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఉపసర్పంచ్ షేక్ మస్తాన్ వలి, వైఎస్సార్ సీపీ నాయకులు గోపిశెట్టి రామకృష్ణ, ఉపాధ్యాయులు అల్లు శ్రీను, పి.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

గ్రామగ్రామాన జగనన్న విద్యాకానుక

దెందులూరు: విద్యార్థులంతా ప్రభుత్వం అందజేస్తున్న జగనన్న విద్యాకానుకను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. సోమవారం సీతంపేట పాఠశాలలో ఎంపీపీ బొమ్మనబోయిన సుమలత, జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం, సర్పంచ్ పరసా లక్ష్మీసుజాత, ఎంపీటీసీ పులవర్తివరమణితో కలిసి ఆయన చిన్నారులకు విద్యాకానుక అందజేశారు. కొవ్వలి ఉన్నత పాఠశాలలో జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు, హెచ్‌ఎం శర్మ, ఉపాధ్యాయులు జగనన్న విద్యాకానుక అందజేశారు. పోతునూరు ఉన్నత పాఠశాలలో సర్పంచ్ బోదుల స్వరూప్, నాయకులు రమేష్, హెచ్‌ఎం రంగన్న, ఉపాధ్యాయులు చిన్నారులకు విద్యాకానుక అందజేశారు.



పెదవేగి : విజయరాయి ఉన్నత పాఠశాలలో విద్యాకానుక కిట్లను పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు



భీమడోలు : జెడ్పీ ఉన్నత పాఠశాలలో జగనన్న కిట్లను అందజేస్తున్న దృశ్యం

చేపల చెరువు విషయంలో తగాదా



న్యాయంపల్లి పెద్ద చెరువు వద్ద ఘర్షణకు దిగిన టీడీపీ, వైసీపీ వర్గీయులను నిలువుదల చేస్తున్న పోలీసులు

పెదవేగి : చేపల చెరువు విషయంలో టీడీపీ, వైఎస్సార్ సీపీ వర్గాల మధ్య వివాదం రేగింది. వివాదం కాస్తా ఘర్షణకి దారితీసి, కొట్టుకునే వరకు వచ్చింది. ఈ సమయంలో పోలీసులు రంగప్రవేశం చేయడంతో వివాదం సర్దుమణిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. పెదవేగి మండలం న్యాయంపల్లి పెద్ద చెరువులో చేపలు పెట్టుకోవడానికి వైఎస్సార్ సీపీకి చెందిన కొంతమంది సోమవారం ఉదయం చెరువులో దిగారు. అదే సమయంలో టీడీపీ వర్గీయులు కొంతమంది అక్కడకు వచ్చి, గతంలో పాటద్వారా చేపలు పట్టుకోవడానికి సొమ్ము చెల్లించామంటూ అడ్డుకున్నారు. దీంతో టీడీపీ, వైఎస్సార్ సీపీ వర్గీయుల మధ్య తీవ్రస్థాయిలో వివాదం జరిగింది. పెదవేగి సీఐ దుర్గాప్రసాద్, ఎస్సై లక్ష్మణ్ ఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు. ఈ సమయంలో మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ చెరువువద్దకు చేరుకుని, గత పాటదారుడైన ఆంజనేయులుకు సొమ్ము చెల్లించి, చేపలు పట్టుకుంటే మాకేమీ అభ్యంతరం లేదని చెప్పారు. దీనికి వైసీపీకి చెందిన వ్యక్తులు ఒప్పుకోలేదు. ఈలోగా ఘటనా స్థలానికి చేరుకున్న నూజివీడు డీఎస్పీ అశోక్‌కుమార్ గౌడ్ ఇరువర్గాలను సముదాయించారు. పంచాయతీ అధికారులతో మాట్లాడి, సమస్యను పరిష్కరిస్తామని హామీఇచ్చారు. టీడీపీ వర్గీయులు కోరినట్టు రెండో వాయిదా సొమ్ము వారికి చెల్లించే అంశాన్ని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వారి ఆదేశాల మేరకు త్వరలోనే అందిస్తామని గ్రామ కార్యదర్శి సుజాత లిఖిత పూర్వకంగా తెలియజేయడంతో సమస్య పరిష్కారమైంది. డీఎల్‌పీఓ పూర్ణచంద్రరావు, నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో పండుగ వాతావరణం

- అన్ని పాఠశాలల్లో జగనన్న విద్యాకానుక పంపిణీ
- ఆనందంలో విద్యార్థులు

దెందులూరు: విద్యతోనే బంగారు భవిష్యత్తు సాధ్యపడుతుందని, ప్రతి చిన్నారి విధిగా విద్యనభ్యసించడం ద్వారా ఆ కుటుంబం అభివృద్ధి చెందుతుందన్న దూరదృష్టితో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్యాభివృద్ధికి అనేక పథకాలు అమలు చేస్తున్నారు. దీనిలో భాగంగా 2023-24 విద్యా సంవత్సరానికి జగనన్న విద్యాకానుకను అన్ని పాఠశాలల్లో పంపిణీ కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి సీతంపేట పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యాకానుక అందించి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాల భవనాలు, మౌలిక వసతులు కల్పించినట్లు ఆయన తెలిపారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో వసతులు లేక, సత్ఫలితాలు రాక ఎన్నో పాఠశాలలు మూతపడ్డాయి. నాడు- నేడు, పలు విద్యా పథకాల కారణంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆయన అమలు చేస్తున్న విద్యా విధానాన్ని దేశ వ్యాప్తంగా మేధావులు ప్రశంసిస్తున్నారు.



సీతంపేటలో జగనన్న విద్యాకానుక కిట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే

జగనన్న విద్యాకానుక కిట్‌లో అందిస్తున్న వస్తువులు : బ్యాగ్, యూనిఫాం, షూ, సాక్స్, నోట్‌బుక్స్, టెక్స్ట్‌బుక్స్, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ, పిక్టోరియల్ డిక్షనరీ (బొమ్మలు), బెల్ట్.

నియోజకవర్గం	పాఠశాలలు	విద్యార్థులు
దెందులూరు	43	5,100
పెదవేగి	74	9,200
పెదపాడు	56	5,471
ఏలూరు రూరల్	52	7,335

సీఎం వైఎస్ జగన్ దూరదృష్టి



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దూరదృష్టి గల గొప్పనేత. విద్య, వైద్యానికి బడ్జెట్‌లో తొలి ప్రాధాన్యత ఇచ్చారు. గ్రామగ్రామాన పాఠశాలల రూపురేఖలు మారడటమే కాకుండా దేశవ్యాప్తంగా చర్చకు తావిచ్చేలా అభివృద్ధి చేశారు. రానున్న కాలంలో విద్యా వ్యవస్థలో మరిన్ని మార్పులు రానున్నాయి.

– కొఠారు అబ్బయ్యచౌదరి, ఎమ్మెల్యే, దెందులూరు

విద్యాకానుక పంపిణీ ప్రారంభం



అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు పాఠశాల ప్రారంభించిన రోజునే రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యాకానుక అందజేస్తున్నారు. పూర్తిస్థాయిలో అన్ని పాఠశాలలకు సరిపడా కిట్లు, పాఠశాలలు చేరాయి. వేడుకలా అన్ని పాఠశాలల్లో పంపిణీ కార్యక్రమం ప్రారంభించాం.

– సీహెచ్.బుద్దావ్యాస్, ఎంఈఓ, దెందులూరు

సంతోషంగా ఉంది



ప్రభుత్వమే మాకు కావాల్సినవన్నీ ఇవ్వడం చాలా సంతోషంగా ఉంది. గతంలో ఎప్పుడూ ఇలా ఇవ్వలేదు. పాఠశాల తెరిచిన రోజున అమ్మ, నాన్నలపై భారంపడకుండా విద్యాసామగ్రి, పుస్తకాలు ఇచ్చారు.

– ఏలూరి ఐశ్వర్య, 9వ తరగతి

ఇంటింటా సంక్షేమ కాంతులు



వడ్లపట్లలో సంక్షేమ లబ్ధి బుక్‌లెట్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

భీమడోలు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఇంటింటా సంక్షేమ కాంతులు వెల్లివిరుస్తున్నాయని ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. అంబర్‌పేట గ్రామ పంచాయతీ శివారు వడ్లపట్ల గ్రామంలో సోమవారం రాత్రి నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లలో ప్రతి ఇంటికి అందిన సంక్షేమ లబ్ధిని వివరిస్తూ వారికి బుక్‌లెట్‌ను అందించారు. సంక్షేమ పథకాలు అమలులో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పనితీరుపై ఆయన ఆరా తీశారు. అనంతరం ఎమ్మెల్యే వాసుబాబు మాట్లాడుతూ కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో సైతం సంక్షేమ పథకాలు కొనసాగిస్తూ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేసిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ప్రజలకు మేలు చేయాలన్న సంకల్ప బలంతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు సాగుతుంటే, ప్రతిపక్షాలు ఓటమి భయంతో అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు టీడీపీకి రాజకీయ సమాధి కట్టడం ఖాయమన్నారు. జగనన్న కాలనీలోని ఇండ్లను చంద్రబాబు ఏ విధంగా పోల్చారో ప్రజలు గమనించారని, వచ్చే ఎన్నికల్లో అతనికి తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఏపూరి భానుదీపిక రాంబాబు, ఎంపీపీ కనమాల రామయ్య, మండల కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు, మండల సాగు సలహా సంఘం అధ్యక్షుడు పసుపులేటి సత్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్, కురెళ్లగూడెం సర్పంచ్ గుడివాడ శ్రీసీతారామాంజనేయులు, పూళ్ల సర్పంచ్ దాయం సుజాత ప్రసాద్, కోడూరుపాడు సర్పంచ్ మానుకొండ నాగేశ్వరరావు, ఎంపీటీసీ సయ్యద్‌వైసీపీ గ్రామ పార్టీ అధ్యక్షులు రామిశెట్టి శ్రీను, బాబూరావు, కర్రి శ్రీను, సొసైటీ ఆజామ్, డైరెక్టర్ సవలం నాని, నాయకులు రామిశెట్టి గోపి, అన్నేపురెడ్డి నాగరాజు, జక్కంశెట్టి శివ, సురేష్, ఇన్‌చార్జి తహసీల్దార్ షంషుద్దీన్, ఏఈ రామస్వామి, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో పేదలకు భరోసా



ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరికి హారతులు పడుతున్న దృశ్యం

దెందులూరు: ఇచ్చిన హామీలతో పాటు మరెన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేసి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేదవాడికి భరోసా నిచ్చారని వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. సోమవారం ముప్పవరం పంచాయతీ కెఎస్ పురం సర్పంచ్ మెండెం సంతోష్‌కుమార్ అధ్యక్షతన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. దళిత, గిరిజన, బడుగు, బలహీన, మైనార్టీ వర్గాల ప్రజలు నాడు రాజన్నకు, నేడు జగనన్నకు మద్దతుగా వెన్నంటి ఉంటూ ఆశీర్వదించారన్నారు. వచ్చే ఎన్నికల్లో మీ అందరి సహకారంతో రానున్నది జగనన్న ప్రభుత్వమేనన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, జడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం, ఎంపీపీ బొమ్మనబోయిన సుమలత, సొసైటీ చైర్మన్ నల్లూరి వెంకట్రామయ్య (బాబి), ముకుంద, సరిపల్లి కుటుంబరావు, ఏపీ మానవహక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కనికెళ్ళ మురళీకృష్ణ, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొన్నారు.

కేఎస్ పురానికి రూ. కోటి నిధులు మంజూరుకు కృషి

ముప్పవరం సర్పంచ్ సంతోష్‌కుమార్ మాట్లాడుతూ గ్రామానికి పైపులైన్, డ్రైనేజీ, జలకళ బోర్లు, పంచాయతీ కార్యాలయానికి ప్రహరీ, ఆక్రమణలో ఉన్న చెరువు సమస్యను తొలి ప్రాధాన్యతగా పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. కేఎస్ పురానికి రూ.కోటి నిధులు మంజూరుకు ముఖ్యమంత్రితో కలిసి మాట్లాడతానని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. తొలుత దివంగత నేత వైఎస్సార్ విగ్రహానికి ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, కామిరెడ్డి నాని, సొసైటీ చైర్మన్ నల్లూరి వెంకట్రామయ్య (బాబి), సర్పంచ్ మెండెం సంతోష్‌కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం

ఉంగుటూరు : వెల్లమిల్లి గ్రామంలోని రామాలయంలో సోమవారం విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మరడ మంగరావు, సర్పంచ్ కుమార్ రాజ. ఉపసర్పంచ్ జి.నాగు, సాయి వైఎస్సార్ సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పలు కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

ఉంగుటూరు : మండలంలో పలు కుటుంబాలను ఎమ్మెల్యే వాసుబాబు సోమవారం పరామర్శించారు. చేబ్రోలులో వాగ్దాన భూమి వ్యవస్థాపకులు మరిగే శాంతకుమారి చనిపోవడంతో ఆమె భర్త పాస్టర్ మరిగే పేసిబాబును వాసుబాబు పరామర్శించారు. అలాగే గోపిభద్రం చనిపోవడంతో అనతి కుమారుడు లక్ష్మణ్‌ను పరామర్శించారు. కాగుపాడులో ఉసురుమర్తి కోటేశ్వరరావు చనిపోవడంతో కుమారుడు విజయభాస్కర్‌ను, నారాయణపురంలో గోలి లక్ష్మీనారాయణ కుమారుడు రామారావును పరామర్శించారు. వాసుబాబు వెంట వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మరడ మంగారావు, పార్టీ నాయకులు పుత్సకాయల విష్ణుమూర్తి, పెనుగొండ బాలకృష్ణ, వెలిశెట్టి పాపారావు బాబ్జి, కొరిపల్లి శ్రీను ఉన్నారు.

3,794 మంది విద్యార్థులకు జగనన్న విద్యాకానుక

పెనుమంట్ర : పెనుమంట్ర మండలంలోని వివిధ పాఠశాలలలో సోమవారం విద్యార్థులకు జగనన్న విద్యాకానుక అందజేశారు. మండలంలో 3,794 మంది విద్యార్థులుండగా 1 నుంచి 5వరకూ 1,897 మంది, 6 నుంచి 10 వరకూ 1,854 మంది విద్యార్థులకు జగనన్న విద్యాకానుకను ఆయా పాఠశాలలో అందజేసినట్టు ఎంఈవో డి.శారదాజ్యోత్స్న తెలిపారు. సోమవారం మార్టేరులోని వేణుగోపాల ఉన్నత పాఠశాల, బాసంతీదేవి బాలికోన్నత పాఠశాలల్లో జగనన్న విద్యాకానుకను ఎంఈఓ, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా విద్యార్థులకు అందజేసారు.

క్రీస్తు ధ్యానంతో చింతలు దూరం

పెదవేగి : నిత్యం క్రీస్తు ధ్యానంతో చింతలు తొలగుతాయని ఏలూరు మేత్రాసన పీఠాధిపతులు పొలిమేర జయరావు అన్నారు. పెదవేగి మండలంలోని విజయరాయి పునీత అంతోని వారి విచారణ 40 వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంగా, పొలిమేర జయరావు ఏలూరు పీఠాధిపతులుగా దశాబ్దపు సేవా జీవిత ఉత్సవ వేడుకలు స్థానిక విచారణ గురువు టి దివాకర్‌రాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా గ్రామ ప్రధాన రహదారి నుంచి బిషప్‌ను సంఘ విశ్వాసులు, ఫాదర్‌లు, కన్యస్త్రీలు ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చారు. దేవాలయ ప్రాంగణంలో పవిత్ర దివ్యబలిపూజ అర్పించారు. అనంతరం గురువులు బిషప్‌ను ఘనంగా సత్కరించారు. ఫాదర్‌లు మైఖెల్, కుమార్, దివాకర్, చిన్ను, ఇతర గురువులు, కన్యస్త్రీలు, విశ్వాసులు పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రత్యేక ప్రార్థనలు

దెందులూరు: ఆర్‌సీఎం ఏలూరు పీఠాధిపతి పొలిమేర జయరావు ఆదేశాల మేరకు దెందులూరు ఆర్‌సీఎం చర్చి ఫాదర్ జీ. అమ్మన్‌రాజా పాఠశాలల విద్యార్థులు సోమవారం దెందులూరు ఆర్‌సీఎం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. 2023-24 విద్యాసంవత్సరం ప్రారంభోత్సవం సందర్భంగా ఈ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.